# నర్రా ప్రభాకరరెడ్డి హత్యను ఖండించండి



ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం వరంగల్ జిల్లా శాఖ కన్వీనర్లలో ఒకరయిన నర్రా ప్రభాకర రెడ్డిని డిసెంబర్ 7వతేదీ ఉదయం 7-30 గంటలకు హనుమకొండలో ఆయన ఇంట్లోనే పోలీసులు కాల్చేసారు. తెల్లబట్టలలో నలుగురు పోలీసులు స్కూటర్ల మీద వచ్చి, బండ్లు ఆయన ఇంటికి రెండు ఫర్లాంగుల దూరాన ఆపి కాలినడకన ఇంటి దగ్గరికి వచ్చారు. ప్రభాకరరెడ్డితో పని ఉందంటూ ఇంటి ముందు గదిలోకి ప్రవేశించారు. లోపలి గదినుండి బయటకు వచ్చిన ప్రభాకరరెడ్డి తలకు రివాల్వర్ గురిపెట్టి మాటామంతీ లేకుండా కాల్చేసారు. తలలో రెండు, ఆ తరువాత ఛాతీలో రెండు బుల్లెట్లు కాల్చగా ప్రభాకరరెడ్డి అక్కడికక్కడే పడి చనిపోయాడు. హంతకులు తాపీగా తమ స్కూటర్ల దగ్గరికి నడిచిపోయారు.

'మాకేమి తెలియదు' అని వరంగల్ జిల్లా ఎస్.పి డి. టి. నాయక్ ప్రకటించినా ప్రభాకరరెడ్డిని చంపింది పోలీసులేననడంలో పౌరహక్కుల సంఘానికే కాదు, ప్రజలకు కూడా ఎటువంటి సందేహం లేదు. ప్రభాకరరెడ్డి పోలీసులకు తప్ప వేరే ఎవ్వరికీ అటంకం కాలేదు. పోలీసులకు ఆటంకమయ్యాడంటే వాళ్ళ చట్టబద్ధమయిన విధి నిర్వహణకు ఆటంకమయ్యాడని కాదు. వాళ్ళ చట్టబాహ్యమయిన రాక్షసత్వానికి ఆటంకం అయ్యాడు.

1985 సెప్టెంబర్ 3న డాక్టర్ రామనాధం గారిని అప్పటి జిల్లా ఎస్పి అరవిందరావుగారి ఆధ్వర్యాన పోలీసులు హత్య చేసిన తరువాత, దాదాపు అయిదేళ్లు వరంగల్‌లో పౌరహక్కుల సంఘం పని చేయలేదు. ఆ అయిదేళ్ళలో వరంగల్ పోలీసులు 32 మందిని 'ఎన్‌కౌంటర్ల' పేరిట కాల్చేసారు. 11 మందిని అరెస్టు చేసి లాకప్పుల నుండి మాయం చేసారు. లెక్క లేనంత మంది పేద రైతులను భూమిలేని కూలీలను అపారమయిన హింసకు గురి చేసారు. దాదాపు 100 మంది మీద 'టాడా' కేసులు పెట్టారు. ఈ రాక్షసత్వాన్ని ప్రశ్నిస్తే కాల్చి పారేస్తారేమోనని వరంగల్ లోని ప్రజాస్వామిక వాదులంతా భీతిల్లే వాతావరణం పోలీసులు కల్పించారు.

ఈ భయాన్ని శాశ్వతం కానీయడానికి వీలు లేదని ముందుకొచ్చిన సాహసి ప్రభాకరరెడ్డి. ఆ సాహసానికి పరిహారమేమిటో తెలిసీ పౌరహక్కుల సంఘాన్ని జిల్లాలో పునరుద్ధరించడానికి కృషి చేయడమే కాదు, న్యాయవాదిగా, 'నక్సలైట్ల' కేసులు నిబద్ధతతో చేయడమూ సాహసమే. గతంలో ఆ కేసులు చేసిన న్యాయవాదులు ఎటువంటి బెదిరింపులు రుచి చూసారో ఏ పరిస్థితిలో వరంగల్ వదిలిపెట్టి పోయారో ప్రభాకరరెడ్డికి తెలుసు. అయినా తాను ఖాతరు చేయకుండా ఆ కేసులు చేపట్టాడు. అప్పుడొకటి, ఇప్పుడొకటి కాదు. 'నక్సలైట్లు' అనే పేరు మీద పోలీసులు జైలుకు పంపిన వారందరికి కేసులూ తన బాధ్యతగానే భావించాడు. ఒక ఉద్యమంగా వాటిని చేపట్టాడు. రెండేళ్ల వ్యవధిలో అరెస్టు చేసి 'టాడా' కేసులు పెట్టిన దాదాపు 700 మందికి బెయిలు తీసుకున్నాడు. జిల్లా కోర్టు ఆవరణలో ప్రభాకరరెడ్డి ఎక్కడుంటాడని ఎవరిని అడిగిన 'నక్సలైట్ స్పెషల్ కోర్టు' అయిన మూడవ అదనపు మేజిస్ట్రేటు కోర్టు వైపు తడబడకుండా చూపించేవారు. అంతగా ఆ బరువు తనమీద వేసుకున్నాడు.

ఈ కేసులు చేపేవాడనే కాదు, ఫీజు అడగకుండా చేసేవాడని పోలీసులకు చాలా కోపంగా ఉండేది. ఇది బహుశా ఆశ్చర్యం కలిగిస్తుందేమో. పేదలకు ఉచిత న్యాయసహాయం అందించాలని భారత రాజ్యాంగం లోని అధికరణం 39-ఏ ఒక ఆదేశిక సూత్రంగా చెప్తుంది. రాజ్యాంగ మంటే పోలీసులకు గౌరవం లేదనుకున్నా, న్యాయవాది ముద్దాయిల దగ్గర ఫీజు ఎంత తీసుకుంటే వాళ్ళకేం తేడా వచ్చిందని అనుకోవచ్చు. అదే పొరబాటు. నిజంగా నేరం చేసారన్న అనుమానం మీద పెట్టే కేసులయితే ఇతర విషయాల గురించి పోలీసులు పట్టించుకోనవసరం లేదు. కానీ కేసులు పెట్టేది నిజమయిన అనుమానం మీద కాదు. వేధింపు కోసం. ఆర్థికంగా క్రుంగదీయడం కోసం. జీవితాన్ని దుర్భరం చేయడం కోసం. నక్సలైట్ రాజకీయాల వల్ల భూములు పొందిన వాళ్లు కూలి రేట్లు జీతాలు పెంచుకున్న వాళ్లు, రకరకాల సామాజిక ప్రయోజనాలు పొందిన వాళ్లు, అప్రయోజనాల కంటే ఎక్కువ నష్టం పాలుకావాలి. 'ఎందుకొచ్చినపోరాటాలు' అని విసుగు చెందాలి. ఊళ్ల మీద దాడులు అందుకోసమే, ప్రజలను మూకుమ్మడిగా చావబాదడం అందుకోసమే, ఇళ్ళు కూల్చడం ఇంట్లోని కుండలు, గిన్నెలు, కుర్చీలు బల్లలు విరగ్గొట్టడం, చితగ్గొట్టడం అందుకోసమే, వందలమందిని హత్య, బస్సు దహనం, బాంబు దాడులు మొదలయిన ఆరోపణలతో 'టాడా' కేసులు పెట్టి జైలుకు పంపించడం అందుకోసమే. ఈ పశుత్వానికి అడ్డం వచ్చే పౌరహక్కుల సంఘమన్నా న్యాయవాదులన్నా పోలీసులకు కోపం రావడం సహజమే. సాయుధ నక్సలైట్లతో పోలీసులు తలపడితే పౌరహక్కుల సంఘం అడ్డం రాదు. న్యాయవాదులూ అడ్డంరారు. కానీ పోలీసులు చేసేది ఆపని కాదు. కాబట్టే వాళ్ళకు పౌరహక్కుల సంఘం అడ్డమొస్తుంది, న్యాయవాదులు అడ్డమొస్తారు.

'మేము జనం మీద టాడా కేసులు పెట్టి, కష్టపడి అరెస్టు చేసి జైలుకు పంపితే, కేసు కాగితాలు రాసినంత సేపు కూడ జైలులో ఉంచకుండా, పైగా ఏ ఖర్చు లేకుండా ఈయన వాళ్లను బయటికి తీస్తుంటే చూస్తూ ఊరుకోవాలా?' అని జనగాం డిఎస్.పి. ప్రభాకరరెడ్డి గురించి బహిరంగంగానే అన్నాడు. వాళ్ళు కేసులు పెడితే బెయిలు

పిటీషన్లు వేయ కూడదు. జైలు నుండి బయటికి తీయకూడదు. కేసు వాదించకూడదు. ఒక వేళ చేసినా వేల రూపాయల ఫీజు తీసుకోవాలి గానీ సానుభూతితో చేయకూడదు. వ్యాపార దృక్పథంతో వకాలత్ చేయాలిగానీ మానవహక్కుల దృక్పథంతో చేయకూడదు. చేస్తే పోలీసుల 'విధి నిర్వహణ' అనబడే పైశాచికత్వానికి ఆటంకం అవుతుంది.

1990లో వరంగల్ జిల్లాలో పౌరహక్కుల సంఘాన్ని పునరుద్ధరించడానికి ప్రయత్నించినప్పుడు ఉత్సాహంగా ముందు కొచ్చిన వ్యక్తులలో ప్రభాకరరెడ్డి ఒకడు. ఆగస్టునెలలో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నప్పుడు బుర్రారాములుతో బాటు కన్వీనర్‌గా ఎన్నికయ్యాడు. ఒక నెల రోజులలో డాక్టర్ రామనాథం 5వ వర్థంతి సభను జిల్లా కమిటీ వరంగల్‌లో విజయవంతంగా నిర్వహించింది. అప్పటినుండి చాలా చురుగ్గా పనిచేస్తూ, అయిదేళ్ళుగా జిల్లాలో పౌరహక్కుల సంఘం పేరు వినబడలేదన్న విషయాన్ని మరపింప జేసింది. 1990 డిసెంబర్ నుండి క్రమంగా పెరుగుతూ వున్న పోలీసు నిర్బంధాన్ని ప్రతిఘటించడమే కాక అనేక పౌరహక్కుల సమస్యల మీద కృషి చేసింది.

1990 డిసెంబర్ 5వ తేదీన నర్మెట్టలో పోలీసులు కాల్పులు జరిపారు. వేగంగా పెరగబోతున్న నిర్బంధానికి నర్మెట్ట కాల్పులు నాంది పలికాయి. కాల్పుల అనంతరం పోలీసులు నర్మెట్ట మండలంలో పెద్ద ఎత్తున నిర్బంధం ప్రయోగించారు. జనాన్నిమూకుమ్మడిగా 'టాడా' కేసులలో ఇరికించారు. ప్రభాకరరెడ్డి స్వగ్రామమయిన వెల్దండ నర్మెట్ట మండలంలో వుంది. ఆ గ్రామానికి ప్రభాకరరెడ్డి 1987 నుండి సర్పంచ్‌గా వున్నాడు. స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికయి గ్రామంలోని బడుగు వర్గాల మేలు కోసం అనేక కార్యక్రమాలు చేపట్టి వాళ్ల ప్రేమకు పాత్రుడయ్యాడు. వెల్దండ పంచాయితీ 'అత్యుత్తమ పంచాయితీ'గా ప్రభుత్వం చేత కూడ గుర్తింపు పొందింది.

నర్మెట్ట మండలంలో 1990 డిసెంబర్ నుండి పోలీసులు ప్రయోగించిన అణిచివేతను ఎదుర్కొనడానికి ప్రభాకరరెడ్డి పౌరహక్కుల సంఘాన్నే కాక మండల సర్పంచ్‌లను ఇతర పెద్దలను కూడా చురుగ్గా కదిలించాడు. మరొక వైపు కోర్టులో కేసులు కూడా తానే చేపట్టి అరెస్టయిన వాళ్ళందరినీ బెయిల్ మీద విడిపించాడు. నర్మెట్ట పోలీసుల అరాచకాలకు వ్యతిరేకంగా మండల సమావేశంలో తీర్మానం చేయించాడు. మండల సర్పంచ్‌లంతా కలిసి జిల్లా అధికార యంత్రాంగంపైన ఒత్తిడి తీసుకొచ్చారు.

నర్మెట్టతో ప్రారంభమయిన అణచివేత వేగంగా జిల్లా అంతటికీ వ్యాపించింది. 'ఎన్‌కౌంటర్లు' మళ్ళీ మొదలయ్యాయి. మనుషులను మళ్ళీ 'మాయం' చేయసాగారు. పోలీసులు పెద్ద సంఖ్యలో గ్రామాలను చుట్టు ముట్టి ప్రజలను హింసించసాగారు. పౌరహక్కుల సంఘం ఈనిర్బంధకాండను సమర్థవంతంగా వ్యతిరేకించింది. 'మాయం' అయిన వారి గురించి న్యాయవిచారణ నిర్వహిస్తున్న జస్టిస్ టి.ఎల్.ఎన్. రెడ్డి కమిషన్ దగ్గరికి సాక్షులను తీసుకుపోయింది. అరెస్టుల వార్తలను ఎప్పటికప్పుడు పత్రికల దృష్టికీ, అధికార్ల దృష్టికి తీసుకొచ్చి ప్రాణాలు కాపాడింది.

ఈ కర్తవ్యానికి పరిమితం కాకుండా పౌరహక్కుల సంఘం వరంగల్ జిల్లాలో అనేక ప్రజాసమస్యలలో తన శక్తి మేరకు జోక్యం చేసుకుని ప్రజాస్వామిక పరిష్కారం కోసం కృషి చేసింది. ఈ కృషిని జిల్లా అధికార యంత్రాంగం నిస్సంకోచంగా ఉపయోగించుకుంది. తానే ఆహ్వానించింది కూడ. ఆర్.టి.సి కార్మికుల సమ్మె, లారీ యజమాన్లకు ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు మధ్య వచ్చిన విభేదాలు, ఇతర అనేక సమస్యలు పౌరహక్కుల సంఘం జోక్యంతో పరిష్కారమయ్యాయి. తమకు అవసరమయినప్పుడు పౌరహక్కుల సంఘం జోక్యాన్ని తామే

## పౌరహక్కుల బాటలో ప్రాణాలర్పించిన న్యాయవాదులు

పౌరహక్కుల కోసం ప్రాణాలర్పించిన న్యాయవాదులు ప్రపంచవ్యాప్తంగా అనేకమంది ఉన్నారు. ఇటీవలి కాలం గురించి మాట్లాడుకుంటే హైతీ దేశంలో అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న, మానవ హక్కుల న్యాయవాది Yveln 1988 అక్టోబర్ 13న పోర్ట్-ఆ-ప్రిన్స్ పోలీసు ప్రధానకార్యాలయం ఎదుట విదేశీ జర్నలిస్టులతో మాట్లాడుతుండగా నలుగురు ముష్కర పోలీసులు కాల్చి చంపారు. పోలీసుల చిత్రహింసల బారినుండి తన క్లయింట్‌ను విడిపించుకోవడం కోసం ఆయన అక్కడికి వెళ్ళారు. జెనీవా కేంద్రంగా పనిచేస్తున్న Centre for the Independence of Judges and Lawyers ఇటీవల ప్రచురించిన సమాచారం ప్రకారం 1988 జనవరి నుంచి 1989 జూన్ వరకూ ప్రపంచ వ్యాప్తంగా 35 మంది న్యాయవాదులు తమ విధి నిర్వహణ వలనా, హక్కుల కోసం పోరాటం వల్ల హత్య చేయబడ్డారు. 37 మంది నిర్బంధించబడగా, 38 మంది బెదిరింపులు, దాడులకు గురయ్యారు. 13 మంది వృత్తి నుంచి తొలగించబడ్డారు...... ఒక్క ఫిలిప్పైన్స్‌లోనే ఈ కాలంలో ఆరుగురు, అంతకంటే చిన్న దేశమైన కొలంబియాలో 21 మంది న్యాయవాదులు హత్య చేయబడ్డారు. 1988లో శ్రీలంకలో గెరిల్లా ఉద్యమకారుల న్యాయవాది విజేదాసలియనారచ్చిని పోలీసులు వారం రోజులు హింసించి చంపారు. (తర్వాత ఎస్.పి. పై హత్య కేసు నమోదు చేశారు.) .....న్యూయార్క్ నుంచి పోరాడుతున్న Lawyers Committee for Human Rights ఈ ఏడాది విడుదల చేసిన నివేదికలో ప్రపంచ వ్యాప్తంగా గత ఏడాది హతమయిన, వేధించబడ్డ, హింసించబడ్డ 470 మంది న్యాయమూర్తుల, న్యాయవాదుల, న్యాయశాస్త్ర విద్యార్థుల, అధ్యాపకుల కేసులను పొందుపర్చారు. వీరంతా అపఖ్యాతి పొందిన క్లయింట్ల తరుపున వాదించినందుకు, లేక మానవ హక్కుల కోసం పోరాడినందు వలనా బాధలకు గురయ్యారు..... మన దేశంలో ఇటీవల కేరళ న్యాయవాదిని కర్నాటకలో హత్య చేశారు. గుజరాత్‌లో ఛీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్‌ను పోలీసు స్టేషన్లో బంధించి వీధుల్లో నిరా పోశారు. ఈ క్రమంలో మన రాష్ట్రంలో పౌరహక్కుల సంఘం గోపి రాజన్న (1985), నర్రా ప్రభాకరరెడ్డి (1991) పేర్లను విషాదంగాను, గర్వంగానూ ప్రకటిస్తోంది.

కోరుకున్న అధికారయంత్రాంగం తమ అవసరం తీరిన తరువాత పౌర హక్కుల సంఘం మీద దుమ్మెత్తి పోయడానికి గానీ ప్రభాకరరెడ్డిని హత్య చేయడానికి గానీ వెనుదీయలేదు.

నిజానికి ఒక్క పోలీసులకు తప్ప వేరే ఎవ్వరికీ వరంగల్‌లో పౌరహక్కుల సంఘం శత్రువుగా కనిపించలేదు. ప్రభాకరరెడ్డి అంత కంటే కనిపించలేదు. వివిధ రాజకీయ భావాలు గల వరంగల్ జిల్లా న్యాయవాదులు ప్రభాకరరెడ్డిని ఏకగ్రీవంగా జిల్లా బార్ అసోసియేషన్ కార్యదర్శిగా ఎన్నుకోవడం దీనికి నిదర్శనం.

పోలీసులకు మట్టుకే ఈ ప్రజాదరణ నచ్చలేదు. పౌరహక్కుల సంఘానికి ఎంతగా ప్రజాదరణ పెరిగితే అంతగా తమ రాక్షసత్వం అసాధ్యం అవుతుంది. అందుకే ప్రభాకరరెడ్డిని తమ హిట్‌లిస్ట్‌లో వేసుకున్నారు. తమ దగ్గర 17 మంది లాయర్లు, మేధావుల లిస్టు వుందనీ, అందులో ప్రభాకరరెడ్డి ప్రథముడని, వాళ్ల సంగతి చూసుకుంటామనీ వరంగల్ (రూరల్) ఎఎస్‌పి సురేంద్ర బాబు లాకప్పులో జనాన్నికొడుతూ చాలా సార్లు హెచ్చరించాడు. హయగ్రీవాచారి హత్యతో వరంగల్ పోలీసుల ప్రతిష్ట దెబ్బ తినిందని భావించి తమ హిట్ లిస్ట్ బయటకు తీసి ప్రభాకరరెడ్డిని కాల్చేసారు. ప్రభాకరరెడ్డి హత్య హయగ్రీవాచారి హత్యకు ప్రతీకారం అనీ 'పీళ్లాకరిని చంపితే వాళ్ళొకరిని చంపుతున్నారు' అనీ కొంతమంది ఒక పద్ధతి ప్రకారం ప్రచారం చేస్తున్నారు. అది పూర్తిగా అవాస్తవం. ప్రభాకరరెడ్డి హత్య ప్రతీకార హత్యే. అయితే హయగ్రీవాచారి హత్యకు ప్రతీకారం కాదు. ఆయనంటే పోలీసులకు అంత ప్రేమ ఉందని మేము అనుకోవడం లేదు. ప్రభాకరరెడ్డి హత్య వరంగల్ జిల్లాలో పౌరహక్కుల సంఘం చేసిన కృషికి ప్రతీకారం. ప్రభాకరరెడ్డి అసాధారణమయిన చొరవతో సాహసంతో పోలీసుల అణచివేత చర్యలకు వేసిన అడ్డకట్టకు ప్రతీకారం. 'టాడా' కేసులు ఎంత వేగంగా పెడితే అంత పట్టుదలతో ముద్దాయిలను జైలు నుండి బయటకు తీసిన ప్రజాన్యాయవాది నిబద్ధతకు ప్రతీకారం. ప్రభాకరరెడ్డి హత్యకు పౌరహక్కుల సంఘం దుఃఖిస్తుంది. ప్రభాకరరెడ్డి హత్యకు పౌరహక్కుల సంఘం గర్విస్తుంది. సరిహద్దు భద్రతా దళాలను వరంగల్ గ్రామాలలో దించాలంటే ప్రభాకరరెడ్డిని తొలగించాలనీ, పౌరహక్కుల సంఘాన్ని దెబ్బ తీయాలనీ ప్రభుత్వం భావించడం ఎంత అమానుషమో పౌరహక్కుల సంఘానికి అంత గర్వకారణం. డబ్బు కోసం గడ్డి కరిచే న్యాయ వాదులను పెద్ద మనుషులుగా గౌరవించే ఈ వ్యవస్థ, పేదలకూ పేదల కోసం పోరాడే వారికి ఉచితంగా న్యాయసహాయం అందించే న్యాయవాది ఉనికినే సహించలేకుండా ఉందంటే దానికి పౌరహక్కుల సంఘం సిగ్గు పడనవసరం లేదు, వ్యవస్థ సిగ్గుపడాలి, పౌరహక్కుల సంఘానికి నీతులు చెప్పే పెద్ద మనుషులు సిగ్గుపడాలి.

నర్రా ప్రభాకరరెడ్డి అమర్ రహే!

పౌరహక్కుల ఉద్యమనేత, న్యాయవాది నర్రా ప్రభాకర రెడ్డిని వరంగల్ పట్టణంలో పోలీసులు హత్య చేయడాన్ని ప్రపంచ వ్యాప్తంగా పౌరహక్కులు, ప్రజా స్వామ్య ప్రియులంతా ఏక కంఠంతో ఖండించారు. పలు సంస్థలూ, వ్యక్తులూ, ఈ సంఘటన పట్ల తమ నిరసనను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి తెలియచేసాయి. బ్రిటన్, ఇటలీ, జపాన్ దేశాలకు చెందిన పౌరహక్కుల సంఘాలకు చెందిన పలువురు నాయకులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికీ, హోం మంత్రికీ, పోలీసు డైరక్టర్ జనరల్‌కు ఈ మేరకు నిరసన లేఖలు పంపించారు.

ప్రభుత్వానికి నిరసనగా లేఖలు పంపిన సంఘాలలో ఆమ్నెస్టీ ఇంటర్‌నేషనల్ (అంతర్జాతీయ క్షమా సంస్థ), ఆ సంస్థ కెనడా శాఖ, మానవహక్కుల న్యాయవాదుల కమిటీ (అమెరికా), నెదర్‌లాండ్స్ న్యాయవాదుల సంఘం, ఏషియా వాచ్ కూడా ఉన్నాయి.

ఇండియన్ లా ఇన్‌స్టిట్యూట్ ఢిల్లీలో డిసెంబరు చివరి వారంలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ప్రభాకరరెడ్డి హత్యను ఖండిస్తూ తీర్మానం చేసింది.

భారతదేశంలో వివిధ ప్రాంతాల నుంచికూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఈ సంఘటనపై అన్ని కోణాలనుంచి నిరసన ఎదుర్కొనక తప్పలేదు. ఢిల్లీ, అహ్మదాబాద్‌లకు చెందిన 85 మంది రచయితలు, జర్నలిస్టులు, కళాకారులూ, విద్యావేత్తలు పౌరహక్కుల న్యాయవాది ప్రభాకరరెడ్డి హత్యను ఖండిస్తూ, ఈ సంఘటనపై న్యాయవిచారణ జరపాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖలు రాసారు.

ఆ తరువాత మరో 30 మంది సామాజిక శాస్త్రజ్ఞులు ఒక సంయుక్త ప్రకటన చేస్తూ ప్రభాకర రెడ్డి హత్యపై న్యాయవిచారణ జరిపించాలని డిమాండ్ చేసారు. ఈ సంయుక్త ప్రకటనపై సంతకాలు చేసిన వారిలో ఢిల్లీ విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.ఎన్.రాజ్, మాజీ ఎస్.ఎస్.టి కమీషనర్ హైదరాబాదులో డాక్టర్ బి.డి. శర్మ, ప్రణాళికా సంఘం మాజీ సభ్యుడు ప్రొఫెసర్ తర్లోక్ సింగ్, ప్రొఫెసర్ వి.ఎం. దండేకర్, ప్రొఫెసర్ వి.ఎస్. వ్యాస్, ఇండియన్ లా ఇన్‌స్టిట్యూట్ డైరక్టర్ ఎలిస్ జాకబ్, ఆర్థికవేత్త శ్రీ ప్రధాన్ హెచ్ ప్రధాన్, గ్రామీణాభివృద్ధి జాతీయసంస్థ ప్రొఫెసర్ శ్రీ జి. పార్థసారథి ఉన్నారు.